## క్లుప్తంగా

### మేయర్ పరామర్శ



నెల్లూరు(బారకాసు) : చెత్త సేకరణ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్న చెరుకూరు సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో మృతిచెందగా, నగరంలోని అతని నివాసానికి మేయర్ స్రవంతి సోమవారం వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అతని మృతదేహానికి నివాళులర్పించారు.

### ఇద్దరు వ్యక్తుల ఘర్షణ

నెల్లూరు సిటీ : నగరంలోని మెడికవర్ ఆస్పత్రి వెనుక వైపు పాతమిట్టపాళెంలో ఓ ప్రభుత్వ భూమి తమదంటే తమదంటూ ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. పాతమిట్ట పాళేనికి చెందిన డి.శివయ్య, ప్రదీప్‌లు అదే ప్రాంతాలోని ఓ ప్రభుత్వ భూమి కోసం ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో రెవెన్యూ సెక్రటరీ దానయ్య ప్రభుత్వ భూమి ఆక్రమణపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చెస్ క్రీడాకారుడికి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఇటీవల జరిగిన 'చెన్నై ఓపెన్ అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ'లో 150 ఫిడే రేటింగ్ పాయింట్లు సాధించిన చెస్ క్రీడాకారుడు పెరెచర్ల హరిరామ్ సాయికృష్ణను స్థానిక చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, అడ్వకేట్ సీతారామాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

### నగరంలో సోలార్ ఎక్స్‌పో



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని రామ్మూర్తినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోలార్ పరికరాల ఎక్స్‌పోను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. డీఈఈలు సునీల్‌కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ ఆశాలత, ఏఈలు గోపాలకృష్ణ, మునిశేఖర్, విజయ్‌కుమార్, కృష్ణవేణి పాల్గొన్నా రు.

### నాణ్యమైన భోజనం వడ్డించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నెల్లూరు (టౌన్) : పాఠశాలలు, హాస్టల్స్‌లలో నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర తెలిపారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మవిన్, సభ్యులు అభిలాష్, విక్రమ్, కాసిఫ్, నాని, యశ్వంత్ పాల్గొన్నారు.

### ఇద్దరు వ్యక్తులపై దాడి

నెల్లూరు(క్రైమ్) : ఇద్దరు వ్యక్తులపై కొందరు దాడిచేసి గాయపరిచారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట పోలీసు క్వార్టర్స్‌కు చెందిన జి.శ్రీసాయివర్ధన్ ఈనెల 19వ తేదీ రాత్రి తన స్నేహితుడు పవన్‌తో కలిసి ఫత్తేఖాన్‌పేట నారాయణ స్కూల్ వద్ద వెళ్తున్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన హతీక్ వారి వద్దకు వచ్చి రూ.10 ఇవ్వమని డిమాండ్ చేశారు. పవన్ లేవని చెప్పడంతో గొడవకు దిగాడు. అడ్డుపోయిన శ్రీసాయి వర్ధన్‌పై దాడి చేశాడు. అంతటితో ఆగకుండా హతీక్ తన స్నేహితులతో కలిసి మరోసారి శ్రీసాయివర్ధన్, పవన్‌లపై దాడిచేశాడు. ఈ మేరకు బాధితులు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### జయభారత్‌లో బ్లడ్ బ్యాంక్

నెల్లూరు (టౌన్) : స్థానిక జయభారత్ ఆస్పత్రిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు, సేవా ప్రియ సౌజన్యంతో యడ్లవల్లి అమృతవల్లి శ్రీనివాసరావు సోమవారం బ్లడ్‌బ్యాంకును ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మల్టిపుల్ డిస్ట్రిక్ట్-316 కౌన్సిల్ సభ్యులు, బ్లడ్‌బ్యాంకు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్, అమృతవల్లి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# టిడ్కో సముదాయాల్లో సచివాలయాల ఏర్పాటు

- కమిషనర్ సూర్యతేజ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తున్నామని, అందులో భాగంగా సత్వర పౌరసేవల కోసం ప్రత్యేకంగా ఒక్కో సచివాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ సూర్యతేజ తెలియజేశారు. ఎస్‌ఎంసీ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని ఆదేశించారు. టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, జంగిల్ క్లియరన్స్ చేశామన్నారు. అదేవిధంగా నిరంతరం సెక్యూరిటీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన గృహాల్లో లబ్ధిదారులు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ క్రమం తప్పకుండా చేపట్టేలా పర్యవేక్షించనున్నామని తెలిపారు. ఎస్‌ఎంసీ పరిధిలో అనుమతుల్లేని నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, అనధికార నిర్మాణాలను పిల్లర్ల దశలోనే గుర్తించి తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 43 అర్జీలు అందుకున్నామని, అందులో విభాగాల వారీగా రెవెన్యూ 1, ఇంజినీరింగ్ 8, హౌసింగ్ 25, పబ్లిక్‌హెల్త్ 2, టౌన్‌ప్లానింగ్ 7 చొప్పున వినతులు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందుతో పాటు అన్ని విభాగాల అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**అన్నక్యాంటీన్లలో సమయపాలన పాటించండి**

ఎస్‌ఎంసీ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో సమయపాలన పాటించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక 19వ డివిజన్‌లోని శ్రీహరినగర్, ముత్యాలపాళెం, రామలింగాపురం ప్రాంతాల్లో అధికారులతో కలిసి కమిషనర్ పర్యటించారు. రామలింగాపురం అన్న క్యాంటీన్‌ను సందర్శించి అల్పాహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడుతూ ప్రతి క్యాంటీన్లో మూడు షిఫ్టులకు గాను ఏడుగురు సిబ్బంది ఉండాలన్నారు. మూడు వేళల్లో క్యాంటీన్ మొత్తాన్ని శుభ్రం చేసి పరిశుభ్రమైన వాతావరణంలోనే ప్రజలకు అల్పాహారాన్ని వడ్డించాలని సూచించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షించాలని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆదేవిధంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రైవేటు స్థలాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ముత్యాలపాళెం ప్రాంతంలో సీసీరోడ్డు ఎక్స్‌టెన్షన్ కోసం నిర్మాణ అంచనాలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న డివిజన్ పరిధిలోని ఫిట్టర్, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, వెంటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్, ఈఈ శేషగిరిరావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కుష్టు సర్వేను విజయవంతం చేయాలి



సర్వేకు సిబ్బందితో సిద్ధమైన డీఎంహెచ్‌ఓ

నెల్లూరు (టౌన్): జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న కుష్టు వ్యాధిపై ఇంటింటికి జరుగుతున్న సర్వేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ వి.సుజాత తెలిపారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సర్వే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధికి సంబంధించిన వివరాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అధికారి ఖాదర్‌వలి, డాక్టర సురేంద్ర, మెడికల్ ఆఫీసర్ సునీత, వైద్యులు సమీర, విష్ణుప్రియ, నరసింహులు, నారాయణ, ప్రసాదాచారి, డీపీఎంఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయి. పార్టీని బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. సభల నేపథ్యంలో కళాజాత వాహనాలకు సోమవారం నెల్లూరులోని ముత్తుకూరు గేట్ సెంటర్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, రైతులు, అంగన్‌వాడీలు, ఆశావర్కర్ల కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. కేంద్రం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. నేతలు రెహానాబేగం, పుల్లయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- నగరంలోని కోటమిట్ట సెంటర్‌లో సీపీఎం పతాకాలను సోమవారం ఆవిష్కరించారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, ఫయాజ్, నరసింహ, మూలం ప్రసాద్, పాల్గొన్నారు.

# 'ఉల్లాస్'పై దృష్టి సారించండి



ఉల్లాస్‌కు సంబంధించిన పుస్తకాల పంపిణీ

నెల్లూరు సిటీ : ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నెల్లూరు రూరల్‌లోని 36 సెంటర్ల ద్వారా 363 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు దృష్టి సారించాలని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉల్లాస్‌కు సంబంధించిన పుస్తకాలను వలంటరీ టీచర్లకు సోమవారం పంపిణీ చేశారు. అడల్ట్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ పి.రాజశేఖర్, వెలుగు ఏపీఎం రోజ్‌మేరీతో పాటు ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరు నెలల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సోమవారం నుంచే ఉల్లాస్ కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా చేయాలన్నారు. ప్రతిఒక్కరూ చదవడం, రాయడం, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, ఆహారం, ఇరుగు పొరుగు, ఆచార వ్యవహారాలు, పిల్లల పెంపకం, ఎన్నికల నిర్వహణ తీరు, చట్టాలపై అవగాహన, టోల్‌ఫ్రీ నంబర్ల ఉపయోగం, గడియారంలో సమయం చూడటం, సంక్షిప్త సందేశాలు పంపడం, ఈ-మెయిల్, సామాజిక మాధ్యమాల వాడకం, బ్యాంకు లావాదేవీలు, యూపీఐ చెల్లింపులు, వివిధ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించేలా బోధనా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు ఎం.రమణయ్య, నజీర్, వి.వెంకటరత్నం, ఎం.మంజుల, శ్రీలత, సునీత, శేషమ్మ, అకౌంటెంట్ బాలజ్యోతి, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



లెప్రసీ సర్వేను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు సిటీ : రూరల్ మండలం అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రారంభమైన లెప్రసీ సర్వేను అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా కుష్టు నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి వైద్యారోగ్య శాఖ సిబ్బంది సర్వే చేసిన తీరుపై ఆరా తీశారు. ఇళ్లకు వేస్తున్న మార్కింగ్‌తో పాటు సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరిని పరీక్షించాలని, శరీరంపై అనుమానాస్పద మచ్చలు ఉన్న వారిని పీహెచ్‌సీకి సిఫార్సు చేయాలని చెప్పారు. ఆయన వెంట వైద్యాధికారులు డాక్టర్ కొల్లి హజరత్‌రెడ్డి, డాక్టర్ కొడావత్ బలరామనాయక్, డీపీఎంఓ వేముల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### 71 షాపులకు వేలంపాట

నెల్లూరు(సెంట్రల్) : స్థానిక మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న కోనేరు షాపులకు సంబంధించి సోమవారం వేలంపాట నిర్వహించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 71 షాపులకు వేలం జరిపారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ మొత్తం 152 దరఖాస్తులు వచ్చాయని, ఒక్కో షాపునకు సంబంధించి 3 నుంచి 2 వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. షాపులు రాని వారికి డిపాజిట్ చెల్లిస్తామని పేర్కొన్నారు. కాగా వేలంపాటలో వివాదాలు తలెత్తే ప్రమాదం ఉండడంతో పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు.

**పలువురి అభ్యంతరం**

పండ్ల వ్యాపారాలకు సంబంధించిన వేలంలో కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ది నెల్లూరు సిటీ ఫ్రూట్స్ మర్చంట్స్ అసోసియేషన్ తరఫున 57 మంది ఉండగా, అందులో 14 మందికే అవకాశం కల్పించారని ఆరోపించారు. తాము 2019లోనే మార్కెటింగ్ శాఖ సూచనల మేరకు ట్రేడ్ లైసెన్సులు పొంది ఉన్నామని, తమ అసోసియేషన్‌లోని అందరికీ అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించగా, వారంలోపు పూర్తి వివరాలు ఇవ్వాలని మార్కెటింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### సర్వోదయ మండల్ సమావేశం



నెల్లూరు(బృందావనం) : మూలాపేట బట్వాడిపాళెంలోని ఏఎఫ్ఆర్ కన్వెన్షన్‌లో జిల్లా సర్వోదయ మండల్ కార్యనిర్వాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వాహక కమిటీ ప్రెసిడెంట్‌గా సాదేపల్లి ప్రేమ్‌కుమార్, జిల్లా రెప్రజెంటేటివ్‌గా జి.అంకయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా రుద్రపాటి రత్నరాజు, జనరల్ సెక్రటరీగా ఎం.చంద్రశేఖర్‌రాజు, సెక్రటరీగా శామ్యూల్, ట్రెజరర్‌గా సాదేపల్లి వేదాంత్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సునీల్, పీఆర్వోగా గుంజి శ్రీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా చంద్రశేఖర్, ప్రదీప్, అనిల్ ఎన్నికయ్యారని ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ అధ్యక్షుడు ఎస్.రాంబాబునాయుడు ప్రకటించారు. సర్వసేవా సంఘ్ జాతీయ మేనేజింగ్ ట్రస్టీ, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మహ్మద్ హుస్సేని ఫరీద్ పాల్గొన్నారు.

### రూ.2 లక్షల చెక్కు అందజేత



నెల్లూరు (టౌన్) : స్థానిక పడారుపల్లిలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కింద రూ.2 లక్షల చెక్కును కల్లూరపల్లి పొదుపు సంఘాల ఆర్పీ లక్కాకుల జ్యోతి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ డి.అజయభాస్కర్ మాట్లాడుతూ కల్లూరుపల్లికి చెందిన దుగ్గిశెట్టి సునీత తమ బ్యాంకులో ఖాతాదారని, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కింద వార్షిక ప్రీమియం రూ.436లు చెల్లించిందన్నారు. ఆమె మృతిచెందిన నేపథ్యంలో బీమా కింద వచ్చిన రూ.2 లక్షల చెక్కును ఆమె భర్త కోటేశ్వరరావుకు అందజేసినట్లు చెప్పారు. బ్యాంకు క్యాషియర్ ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

### 1న శ్రీకృష్ణ బలరాముల రథయాత్ర

నెల్లూరు(బృందావనం) : నగరంలో ఫిబ్రవరి 1వ తేదీన 'ఇస్కాన్' నెల్లూరు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ బలరాముల రథయాత్ర జరుగనుందని ఇస్కాన్ నెల్లూరు మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుకదేవస్వామి తెలిపారు. మినీబైపాస్‌రోడ్డు వద్ద ఇస్కాన్ మందిరంలో ఈ మేరకు ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథయాత్రకు భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు. మందిర మేనేజర్ రాజశేఖర్‌దాస్ మాట్లాడుతూ రథయాత్ర మూలాపేట అలంకార్ సెంటర్‌లోని హనుమాన్ విగ్రహం వద్ద మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటలకు ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదురుగా సర్వోదయ కళాశాల మైదానంలో ముగియనుందన్నారు. సమావేశంలో రథయాత్ర కమిటీ సభ్యులు డీవీఎస్ గిరి, వీవీ కృష్ణారెడ్డి, కొట్టి రామమూర్తి, సూళ్లూరుపేటకు చెందిన డీవీఆర్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.



### అనధికార మద్యం విక్రయాలపై దాడులు

- ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : అనధికార మద్యం విక్రయాలపై నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ -1 అధికారులు సోమవారం నగరంలో దాడులు చేశారు. పెన్నావారధి సెంటర్ వద్ద అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న బుచ్చిరెడ్డిపాళెం పంచేడు గ్రామానికి చెందిన కె.ఉదయ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 11 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జేకేవీఎన్ మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

### సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

నెల్లూరు(బారకాసు) : మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులు, విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ రబియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం ఈఈఎల్‌టీపీ ప్రాజెక్ట్(ఎంప్లాయ్‌బిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ అండ్ లైవ్‌లీ హుడ్ ట్రెనింగ్ ప్రోగ్రామ్) కింద శిక్షణ ఇస్తామని, అంతే కాకుండా ఎన్ఐఈఎల్ఐటీ(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్) సర్టిఫికెట్ కూడా ఇస్తామన్నారు. బీటెక్, డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, పదో తరగతి చేసినవారు అర్హులన్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు మద్రాసు బస్టాండ్ సమీపంలోని హోటల్ అభిరామ్ వెనుక శిక్షణ కేంద్రంలో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 62812 59285, 0861-7961281 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

### బంగారు సరుడు చోరీ

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని కోడూరుపాడు కట్టీ కాలనీలో ఓ మహిళ ఇంట్లో బంగారు సరుడు చోరీకి గురైంది. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. కాలనీలో స్వాతి అనే మహిళ నివాసం ఉంటోంది. ఆమెకు మూగ, చెవుడు ఉంది. ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి స్వాతి ఇంట్లోకి ప్రవేశించి టేబుల్ మీద ఉంచిన సరుడుని దోచుకెళ్లాడు. దీంతో బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రాజేష్‌కు డాక్టరేట్



రాజేష్

నెల్లూరు (టౌన్) : ఎన్బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రూరల్ మండలం ములుమూడి గ్రామానికి చెందిన ములుమూడి రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ట్రిపుల్- ఈ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎ.లక్ష్మీదేవి పర్యవేక్షణలో 'ఏఐ ఎనేబుల్డ్ పవర్ క్వాలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ ఇన్ రెన్యువబుల్ ఇంటిగ్రేటెడ్ స్టాండ్ ఏ లోన్ సిస్టమ్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు రాజేష్‌కు వర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ట్రిపుల్ ఈ విభాగాధిపతి సురేష్‌రెడ్డి అభినందించారు.

### ఫిర్యాదులు నిజమైతే కఠిన చర్యలు

నెల్లూరురూరల్: గ్యాస్ సిలిండర్ డెలివరీ నిమిత్తం ప్రభుత్వం నిర్దేశించిన దాని కన్నా అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అవి నిజమైతే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ కే కార్తీక్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్‌కార్డుదారులకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. అన్ని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సేల్స్ అధికారులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదులపై విచారించి ఏజెన్సీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దీపం-2 పథకం కింద లబ్ధిదారులెవరూ అదనంగా పైకం చెల్లించాల్సిన అవసరం లేదని, డెలివరీ బాయ్స్ అదనపు పైకం వసూలు చేస్తే టోల్ ఫ్రీ నంబరు 1967కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చునని, ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చునని తెలిపారు.

### పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ఎస్‌ఎంసీ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయి చెల్లించని గృహాలకు కనెక్షన్ తొలగించాలని, వ్యాపార సంస్థలు అయితే సీజ్ చేయాలని ఆదేశించారు. వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, డివైడర్లపై పచ్చదనం తదితర అంశాలపై పర్యవేక్షించాలన్నారు. రోడ్ల మరమ్మతుల పనులు వేగవంతంగా జరిగేలా చూడాలన్నారు. రోడ్లపై ఉన్న గుంతలు, గోతులను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు అవసరమైన చోట సీసీరోడ్డు నిర్మాణాలకు ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలన్నారు. సచివాలయ పరిధిలో స్పీడు బ్రేకర్ల నిర్మాణం నిబంధనల మేరకు ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో టిడ్కో ఎస్‌ఈ మహేష్, ఈఈ, డీఈలు, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఈఈ శేషగిరిరావు, రహంతు జానీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### రేపు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఏపీ ట్రాన్స్‌కో ఉత్తర్వుల మేరకు విద్యుత్ సంస్థ ఇంటర్ సర్కిల్ క్రికెట్ పోటీలు బుధవారం జరుగుతుందని ఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్, గేమ్స్ సెక్రటరీ ఆర్.వేలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించే సెలక్షన్స్ ట్రయిల్స్‌కు డ్రస్ కోడ్ పాటించి హాజరు కావాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 90308 02038, 94906 15746 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### బ్యాడ్మింటన్‌లో సత్తా



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని వసంతోపు సెంటర్‌లో ఫ్యూచర్ ఫిట్‌నెస్ బ్యాడ్మింటన్ కప్- 2025 పోటీల్లో సచివాలయ ఉద్యోగులు సోమవారం సత్తా చాటారు. ఈ మేరకు నిర్వాహకులు వారికి బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

### ఐదు అర్జీల స్వీకరణ

నెల్లూరు (వీఆర్సీసెంటర్) : నెల్లూరు అర్బన్ రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం ఐదు అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ షఫీ మాలిక్ వాటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

### జేఈఈ మెయిన్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

నెల్లూరు (టౌన్) : ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, పొట్టేపాళెంలోని ఐయాన్ డిజిటల్ సెంటరు, విద్యానగర్‌లోని ఎన్బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగే పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు.

### కోసూరు రత్నంకు పురస్కారం



నెల్లూరు(బృందావనం) : విశాలాక్షి వృద్ధాశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నం ఇండోనేషియా ప్రభుత్వ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. అందుకు సంబంధించి ఆయన సోమవారం మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా తనకు పురస్కారం లభించినట్లు తెలిపారు.

### గర్భిణులను గుర్తించాలి

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని ప్రతి ఆశా కార్యకర్త ఇంటింటి సర్వే నిర్వహించి గర్భిణులను గుర్తించి 12 వారాల్లోపు నమోదు చేయాలని డీఎంహెచ్ఓ సుజాత ఆదేశించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల నమోదులో అలసత్వం వద్దని సూచించారు. సమావేశంలో డీఐఓ ఉమామహేశ్వరి, డీపీహెచ్ఎన్ మంజుల పాల్గొన్నారు.

### వాకర్స్ ఉద్యమ పితామహుడికి నివాళి



నెల్లూరు(బృందావనం) : జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో వాకర్స్ ఉద్యమ పితామహుడు సుంకర ఆళ్వార్‌దాస్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జెడ్పీ వాకర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి, సంఘ సభ్యులు యు.చెంచయ్య, ఎమ్వీ కృష్ణయ్య, వెంకటరమణయ్య, ఖాజామస్తాన్, హర్షవర్ధిని, మేరీ బ్లెస్సింగ్టన్, సావిత్రమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

### హరిబాబుకు అవార్డు

నెల్లూరు(బృందావనం) : సినీ, టీవీ హాస్యనటుడు, నెల్లూరు వాసి దోర్నాల హరిబాబు రెబల్‌స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి కళావేదికలో సోమవారం రాత్రి ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా పలువురికి అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా ఆయనకు పలు విభాగాల్లో పురస్కారం దక్కింది.

### గిరిజనాభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : గిరిజనాభివృద్ధి ప్రణాళికలు, పాఠశాలల పురోగతిపై నగరంలోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ట్రైకార్ చైర్మన్ బి.శ్రీనివాసులు, డైరెక్టర్స్ లావణ్య, అనూరాధ పాల్గొని, గిరిజనులకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు, గిరిజన పాఠశాలల పురోగతిపై చర్చించారు. అనంతరం రాపూరు మండలంలోని గిలకపాడు గ్రామంలో రసూలు అనే లబ్ధిదారునికి మంజూరు చేసిన ప్యాక్ హౌస్‌ను సందర్శించారు. వెంకటగిరి పట్టణంలోని గిరిజన పాఠశాలను సందర్శించి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ పరిమళ, ఏపీఓ హార్టికల్చర్ ఖలీమ్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.